క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

తగరపువలస: బైపాస్‌రోడ్డు లోని తాతా థియేటర్ వెనుక గల శ్రీలక్ష్మి విజయ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని అదే రోజు శంకర్ ఫౌండేషన్ ద్వారా వాహనాల్లో నగరానికి తరలించి తిరిగి ఆస్పత్రి వద్ద వదిలిపెట్టనున్నట్టు వైద్యుడు డీవీ రామభద్రరాజు తెలిపారు.

ఘనంగా అన్నకూటోత్సవం



శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకులు

భీమునిపట్నం: స్థానిక ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం అన్నకూటోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పూర్ణాహుతి, ధ్వజారోహణం, శ్రీవారికి చక్రస్నానం చేయించారు. అనంతరం అన్నకూటోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ, అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం పరిశీలన



ఆదర్శనగర్‌లో శిక్షణ శిబిరంలో జెడ్పీ రాము

తగరపువలస: జీవీఎంసీ ఆధ్వర్యంలో రెండో వార్డు ఆదర్శనగర్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఉదయం భీమిలి జెడ్పీ బొడ్డేపల్లి రాము సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. శిక్షణ తరగతులు జరుగుతున్న తీరు, పౌష్టికాహారం పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. కోచ్‌లు బంగారు పరదేశి, గౌతంతో మాట్లాడుతూ మరింత మంది చిన్నారులను ఈ శిక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు. ఎండ తీవ్రత పెరగక ముందే శిక్షణ ముగించాలని సూచించారు.

రైతుమిత్ర సభ్యులు హాజరవ్వాలి

పద్మనాభం: ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురంలో ఆదివారం నిర్వహించే వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళాకు పద్మనాభం మండలానికి చెందిన నాలుగు రైతు మిత్ర గ్రూపు సభ్యులు హాజరు కావాలని ఏవో ఎం.వి.ఎస్.చలం కోరారు. బి.ఆర్.తాళ్లవలస, పొట్నూరు గ్రామాల పరదేశమ్మ తల్లి రైతు మిత్ర, తునివలస బంగారమ్మ, రేవిడి రమణ రైతుమిత్ర గ్రూపు సభ్యులు మేళాకు హాజరు కావాలని కోరారు. ఈ గ్రూపు సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రాక్టర్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

చెక్కుల పంపిణీ నేడు

ఆనందపురం : మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఆదివారం పరిహారం చెక్కులు పంపిణీ చేయనున్నామని తహసీల్దార్ లోకవరపు రామారావు తెలిపారు. అలాగే వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ద్వారా అందించే యంత్ర పరికారాల పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

అధ్వానంగా ఆలయ పరిసరాలు



ఆలయాల ఆవరణలో సిమెంట్ బెంచీ వద్ద మద్యం సీసాలు



రావి చెట్టు మొదట్లో మేక, గొర్రెల తోళ్లు, రక్తపు మరకలు

సంగివలస అమ్మవార్ల ఆలయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న భక్తులు

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయ పరిసరాలను భక్తులే అపరిశుభ్రంగా మార్చేస్తున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునే భక్తులు ఇక్కడి దేవతా వృక్షాల ఆవరణలోనే మేకలు, కోళ్లు, గొర్రెలను బలిచ్చి పరిసరాలను శుభ్రం చేయకుండానే వెళ్లిపోతున్నారు. దీంతో ఈ ఆవరణలో కోళ్లు, మేకలు, గొర్రెల వ్యర్థాలతోపాటు మద్యం సీసాలు, తిని పారేసిన భోజన పళ్లాలు దర్శనమిస్తున్నాయి. ఆలయం ఎదురుగానే మద్యం దుకాణం ఉండడంతో ఆకతాయిలు సైతం ఆలయాన్ని ఆనుకుని పార్కులో సిమెంట్ బెంచీలపై తాపీగా మద్యం సేవించి సీసాలను అక్కడే పడేస్తున్నారు. ఆలయ ఆవరణలో చెట్లు, సిమెంట్ బెంచీలు, దివీస్ లేబొరేటరీ నిర్మించిన పార్కులో నిర్వహణ లేకపోవడంతో ఆహార ప్యాకెట్లు తీసుకొచ్చిన పాలిథిన్ సంచులు, మద్యం సీసాలు గుట్టలుగా పడి ఉన్నాయి. పార్కులో వృద్ధులు, చిన్నారులు, మహిళల కోసం వేర్వేరుగా నిర్మించిన శిబిరాలు ఆనవాళ్లు కోల్పోయాయి. ఆలయం నుంచి సంగివలస కాలనీ వరకు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెను చిల్లర దొంగలు కట్ చేసి పట్టుకుపోయి అమ్మేసుకున్నారు. ఇవన్నీ అమ్మవార్ల ఆలయం చెంత ఆకతాయిలే చేస్తున్నా వారిలో పాపభీతి లేకపోవడం గమనార్హం.

ఓపెన్‌గా ఉన్నప్పుడే మెరుగు

సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం నుంచి అల్లూరి సీతారామరాజు కాలనీ వరకు గతంలో ఖాళీ ప్రదేశం ఉండేది. ఇందులో కొంత భాగంలో దేవదాయశాఖ దేవతా వృక్షాలను నాటి సంరక్షించగా మిగిలిన ప్రదేశంలో దివీస్ లేబొరేటరీ అభివృద్ధి పేరుతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పదుల సంఖ్యలో సిమెంట్ బెంచీలు, సేద తీరడానికి హట్‌లు, కంచెలు ఏర్పాటు చేసింది. వీటికి నాలుగేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయి. వాస్తవానికి ఈ ఆవరణలో దివీస్ లేబొరేటరీ అభివృద్ధి పనులు చేయక మునుపే బాగుండేది. అభివృద్ధి పనులు చేపట్టి నిర్వహణ గాలికి వదిలేయడంతో ఆలయ పరిసరాలు సైతం అపవిత్రమవుతున్నాయి. నిత్యం ఆలయం వద్ద ఉండే బిక్షగాళ్లు వాటర్ ప్లాంట్, గోశాల వద్ద మలమూత్ర విసర్జన, పొగ తాగడం, మద్యం సేవించడం వంటి పనులతో పరిసరాలను జుగుప్సాకరంగా తయారు చేస్తుండగా ఆలయాలకు వచ్చే భక్తులు అసహ్యించుకుంటున్నారు. కాసేపు ఆలయ పరిసరాల్లో కూర్చుందామనుకున్నా అపరిశుభ్ర వాతావరణం కారణంగా వెంటనే వెనుదిరుగుతున్నారు. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణంపై కొత్తమ్మ ఆలయ సిబ్బందితో మాట్లాడగా శుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వృద్ధులు సేద తీరే శిబిరం వద్ద తుప్పలు

వైభవంగా రామాలయ ప్రారంభం

ఆనందపురం : మండలంలోని కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ విడుదల చేసిన రూ.10 లక్షల నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. దేవాలయం శిఖరంపై కలశ ప్రతిష్ట చేసి గర్భగుడిలో సీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలచే సామూహిక పూజలు చేయించి రామనామం జపించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్ర మంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోన్ కన్వీనర్ గరిమేన రాధాకృష్ణ, జిల్లా కన్వీనర్ శివాజీ, ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్, విశాఖ జిల్లా సహ కన్వీనర్ గోపాల కృష్ణమూర్తి, మండల సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ గొడ్డు గౌరినాయుడు, ఆర్ఎస్ఎస్ ధర్మ ప్రచారక్ తమ్మిన నరిసింగరావు, ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరపుల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

డీసీసీపీ కోర్సుతో మంచి ఫలితాలు

భీమునిపట్నం: పాలిటెక్నిక్‌కు సంబంధించి డిప్లమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ కోర్సు (డీసీసీపీ)ను అభ్యసిస్తే మంచి ఫలితాలు ఉంటాయని మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన వారు ఈ కోర్సులో చేరే అవకాశముందని, దీనికి స్కాలర్‌షిప్, హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ కోర్సును ఎంచుకుని కళాశాలలో చేరాలని కోరారు.

పబ్లిక్ డిమాండ్

నాలుగు రోడ్ల జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం శ్రీనివాస స్కూల్ నుంచి గాయత్రి కాలేజీకి వెళ్లే మార్గంలో ఉన్న నాలుగు రోడ్ల జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి గాయత్రి కాలేజీ, అష్టలక్ష్మి ఆలయం రోడ్డు మీదుగా కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గం ఇది. ఈ రెండు రోడ్లతోపాటు ఇంకో రెండు వైపులా పదుల సంఖ్యలో ఉన్న అపార్ట్‌మెంట్‌ల నుంచి వచ్చే రోడ్లు కూడా ఇక్కడే కలవడంతో 4 రోడ్ల జంక్షన్ ఏర్పడింది. కాలనీలు, అపార్ట్‌మెంట్లతోపాటు విద్యాసంస్థలు, ప్రముఖ దేవాలయం ఉండడంతో నిత్యం ఈ కూడలి రద్దీగా ఉంటోంది. ఈ జంక్షన్‌కి 4 రోడ్ల నుంచి ఏవిధమైన జీబ్రా లైన్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవు. పైగా చుట్టూ అపార్ట్‌మెంట్లు ఉండడంతో దగ్గరకి వచ్చినంత వరకూ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ, పోలీసు అధికారులు తక్షణమే స్పందించి ఇక్కడ హెచ్చరిక బోర్డులు, జీబ్రాలైన్స్ ఏర్పాటు చేయాలి.

– ధనుంజయరావు, సాయి సూర్య అపార్ట్‌మెంట్, రేవళ్లపాలెం



తరచూ ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్ ఇదే

గాజువాక వెళ్లి పింఛన్ అందజేత



అప్పయ్యమ్మకు గాజువాకలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ కనక మహాలక్ష్మి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ చిన్నిపేటకు చెందిన వలంటీర్ బోని కనక మహాలక్ష్మి శనివారం గాజువాకలో చికిత్స పొందుతున్న 72 ఏళ్ల వృద్ధురాలు చిల్ల అప్పయ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ అందించింది. ఇటీవల అప్పయ్యమ్మకు కాలు విరిగిపోవడంతో బీహెచ్‌పీవీలోని తన కుమార్తె మద్ది రాజేశ్వరి ఇంట్లో ఉంటూ గాజువాకలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో వలంటీర్ సేవలను మండలంలోని పలువురు అభినందించారు.

శ్రీహరివాసానికి హరిత శోభ

పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా శ్రీవారి సన్నిధి



శ్రీవారి ఆలయ ప్రాంగణంలో పచ్చదనం



శ్రీవారి పాదాల నుంచి ఆలయం వరకు ఏర్పాటు చేసిన పూల మొక్కలు



రోడ్డుకు ఇరువైపులా కనువిందు చేస్తున్న పచ్చదనం

కొమ్మాది: కొండపై నుంచి చూస్తే నీలి రంగులో కనువిందు చేసే సాగరం... కొండపైన కోరికలు నెరవేర్చే వేంకటేశ్వరస్వామి... ఎక్కడ చూసినా కనుచూపు మేర పచ్చని ప్రకృతి, వివిధ వర్ణాల పూల మొక్కలతో అడుగడుగునా ఆధ్యాత్మికం, ఆహ్లాదాన్ని పంచుతూ భక్తులను తన్మయత్వానికి గురిచేస్తోంది రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ). బిజీ జీవితంలమనుషులు మానసిక ప్రశాంతత కోరుతూ ఆహ్లాదకర ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలను ఆశ్రయిస్తుంటారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఆధ్యాత్మికత, ఆహ్లాదం అందించాలనే మహా సంకల్పంతో టీటీడీ ఇక్కడ పచ్చదనానికి పెద్ద పీట వేసింది. ఆలయ ముఖద్వారం నుంచి శ్రీవారి సన్నిధి వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ వర్ణాల పూలకుండీలు, పచ్చని గడ్డి తివాచీలు, పలు రకాల క్రోటన్ మొక్కలు, పూల మొక్కలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని పరిరక్షించేందుకు ఐదుగురు వ్యక్తులను నియమించారు. అటు సాగరుడు, ఇటు పచ్చదనంతో కూడిన ఈ ఆలయానికి వారానికి ఒక్కసారైనా రావాలని భక్తులు కోరుకుంటున్నారు. 1.5 ఎకరాల్లో ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. కొండపైకి వెళ్లే రోడ్డు మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శిల్పకళా నైపుణ్యం ఉట్టిపడేలా నిర్మించిన ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది.

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు



శివశక్తినగర్ రోడ్డుపై రాకపోకలకు అడ్డంగా బ్లాక్‌మెటల్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తి నగర్‌లో కొందరు గృహ నిర్మాణదారులు రోడ్డుపై రాకపోకలకు కనీసం దారి విడిచిపెట్టకుండా గృహ నిర్మాణ సామగ్రి వేసేస్తున్నారు. బ్లాక్ మెటల్, ఇసుక తదితర సామగ్రి నిల్వ చేయడంతో అత్యవసర సమయాల్లో కూడా ద్విచక్ర వాహనాలే కాదు, కాలి నడకన కూడా వెళ్లడానికి అవకాశం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటు వంటివి తరచూ జరుగుతున్నా, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. శివశక్తినగర్ మసీదు, వాటర్ ట్యాంక్‌లు ఉన్న కొండపైకి వెళ్లే 3వ లైన్‌లో కొద్ది రోజులుగా ఓ వ్యక్తి గృహ నిర్మాణం సాగుతుంది. దీని నిర్మాణ పనుల కోసం చిన్నపాటి కాలినడక జాగా కూడా లేకుండా ఇసుక, బ్లాక్ మెటల్, ఇటుక వేసేశారు. ఇలా వేస్తున్నట్టు కనీసం సమాచారం ఇచ్చినా వాహనాలు ముందే బయట పెట్టుకునే వారిమని, ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని అంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డివైడర్లపై మొక్కలు మాయం



ప్రధాన రహదారిపై మొక్కలు లేక బోసిగా ఉన్న డివైడర్



ప్రైవేట్ మార్కెట్ వద్ద డివైడర్లపై మట్టి తొలగించిన తర్వాత దృశ్యం

తగరపువలస: జీవీఎంసీలోని భీమిలి జోన్‌లో డివైడర్లపై మొక్కల జాడే కనిపించడం లేదు. గతంలో పలుమార్లు తాతా థియేటర్ నుంచి బంగ్లామెట్ట వరకు డివైడర్ పొడవునా మొక్కలు నాటి, రక్షణగార్డులు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేని కారణంగా రక్షణగార్డులు తుక్కు కేంద్రాలకు తరలిపోగా మొక్కలు పశువుల బారిన పడి మోడుగా మారి ఎండిపోయి కనిపించకుండా పోయాయి. దీంతో ప్రస్తుతం ఈ డివైడర్లు చిరు వ్యాపారులకు కేంద్రంగా మారిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో డివైడర్‌పై మట్టి కూడా మాయం గమనార్హం. అధికారులు స్పందించి, ఆహ్లాదం పంచవలసిన డివైడర్లపై మొక్కలను పునరుద్ధరించి సంరక్షించాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తగరపువలస: ఈ నెల 12న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా శనివారం భీమిలి మండలం తాళ్లవలసలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. దీనిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మెగా టోర్నీలో 64 జట్లు పాల్గొంటాయన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.22,222, రూ.11,111, రూ.5,555, రూ.3,333 నగదు బహుమతులతోపాటు వ్యక్తిగత ట్రోఫీలు అందిస్తామన్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బోని సన్నిబాబు, సింగపూర్ బుజ్జిరాజు, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, దంతులూరి వేణురాజు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లవలసలో క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు

వరుణ దేవుడి కోసం పూజలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వర్షాలు కురవాలని కోరుతూ శనివారం కప్ప కప్ప నీలాలు ఆడారు. కప్పను కర్రకు గుడ్డలో కట్టి కర్రను చిన్నారులు భుజాలపై పెట్టుకుని గ్రామంలోని ఇంటింటికీ తిరిగారు. ఆ కప్పపై మహిళలు నీరు పోసి పూజలు చేశారు. అనంతరం కప్పను గోస్తనీ నదిలో విడిచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర నారాయణరావు పాల్గొన్నారు. ఆదివారం ఎర్ర చెరువులో వరద పాసికం నిర్వహించనున్నారు. పుట్టపై మహిళలు 101 బిందెలతో నీరు పోసి పూజలు చేయనున్నారు.



కృష్ణాపురంలో కప్ప కప్ప నీలాలు ఆడుతున్న దృశ్యం

పలువురికి హెచ్‌ఐవీ పరీక్షలు



మొబైల్ వ్యాన్‌తో ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం / తగరపువలస: మండలంలోని బోని గ్రామంలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ సీడ్ మొబైల్ ఐసీటీసీ ఆధ్వర్యంలో టార్గెట్ పీపుల్స్‌కు హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. గర్భిణులు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 42 మందికి పరీక్షలు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్ కుమార్, లింక్ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ దినోత్సవం

ఆనందపురం: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది లొడగలవానిపాలెంలో ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు కె.శైలజ మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల శారీరక, మానసిక వ్యాయామం లభిస్తుందన్నారు. కొవ్వు కరిగి శరీర బరువు తగ్గించుకోవచ్చన్నారు. శారీరక బరువు తగ్గి గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు సైకిల్ తొక్కాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, గోవిందరావు, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లొడగలవానిపాలెంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

సీతమ్మధార : ప్రాణత్యాగం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును రక్షించుకుంటామని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 793వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తుందని, దానిని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతోపాటు కొత్తగా తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచి పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఎస్.అజయ్‌కుమార్, సూర్యకేశవ పాల్గొన్నారు.